కథానిక

# జారుడు నేల

పోలవరపు శ్రీహరిరావు

అతనిజీవితమే అంత. ఏ పాపిష్టిగడియలో యీ భూమ్మీద జారిపడ్డాడోగాని, యీ నలభై సంవత్సరాల చిల్లరాకూడా ఆ జారుడుదోవనే నడిచాడు; యిప్పుడు నడిచేదీ చిత్తడి రేవడినేల మీదే.

మానవుడు నడిచేందుకు ఎన్ని రాజమార్గాలు, తడిసెరుగని పొడిదోవలు లేవు: ఎన్ని మహావృక్ష శీతలచ్ఛాయామార్గాలు లేవు—అని మీరడుగుతారు. కాని ఆప్రశ్నలు అతణ్ణి అడిగితే 'నాకు తెలిసినంతవరకూ, ఏదోవా పొడిపొడిగా కన్పించడం లేదు' అంటాడు. మీరు విస్తుపోయి 'పిచ్చివాడ'నుకుంటారు; లేకపోతే అతని తీర్పుకు కారణాలేమిటో రుజువు చెయ్యమని పట్టుపడతారు.

ఈ బిభీషలెందుకు—నేచెబుతా వినండి, అతని జీవితగమనం. అతనికి పరిసర వాతావరణం అర్థమవడం ప్రారంభమైన ఆయిదోయేట ఒకనాడు మధ్యాహ్నం తండ్రి భోంచేస్తున్నాడు. తల్లి తనను బడికిపంపించేందుకు—పలకా, బలపం, కొబ్బరికాయలూ, బెల్లం తీసుకురమ్మని చెబుతూంది. తండ్రి— 'సింగినాదంకూడా తేవద్దూ? పలకా బలపంతో బడికి పంపితేచాలు; ఫలహారాల పంపిణీ లక్కర్లేదులే— యింతోటికొడుక్కి' అని విసుక్కున్నాడు. ఇంతలో ఎవరో బజారులోనుంచి తనతండ్రిని పిలిచారు. తను బయటికివెళ్లి, ఆ పిలిచిన శెట్టిని మర్యాదగా—కూర్చోమని తండ్రి భోంచేస్తున్నాడనీ చెప్పి, లోపలికెళ్ళి ఆ సంగతి తలిదండ్రులకు విశదపరిచాడు.

వెంటనే తండ్రి ఎంగిలిచేయి తన చెంపమీద మీద ఫెళ్ళున మోగటంతో- కాలుజారి పడిపోయాడు. నట్టిల్లు అంత జారుడుగా వుంటుందని అప్పటిగ్గాని అతనికి తెలియలేదు. ఆ యథార్థం అతని తండ్రే సెలవిచ్చాడు—"వెధవా...బాకీకోసం శెట్టివస్తే 'మా నాన్నలేడ'ని చెప్పి సాగనంపేదానికి బదులు కూర్చోబెట్టి మర్యాదచేసాచ్చావ్? నీ తెలివితగలడిందని, సిగ్గులేక పైగా చంకలెగరేస్తూ చెబుతున్నావ్? ఇపుడు వాడు గొంతుమీద కూర్చుంటాడుగదా డబ్బెక్కణ్ణుంచి తెచ్చిస్తారనుకున్నావ్‌రా కుంకా" అనే వురుములతో.

తల్లివచ్చి "కుర్రకుంకకేం తెలుసునని కోప్పడుతున్నారండీ" అని తనకు చేయూత నిచ్చి లేపింది. కాని, సాయంకాలంవరకూ యింట్లో ఎక్కడ నడుస్తున్నా జారుడు నేలలా—తూలిపోతూనే వున్నాడు.

ఫోర్తుఫారంలో క్లాసుకు ఫస్టుగా ప్యాసయిన సంతోషవిషయం తలిదండ్రులతో చెబుదామని బస్తీనుంచి, తమ పల్లెకు మూడుమైళ్ళు మూడు నిముషాల్లోనడిచి, యింట్లో కాలుబెట్టేసరికి— "వాడెందుకు వింటాడే? వాడు కలెక్టర్ కాబోతూండెగదా, యిక నువ్వూ నేనూ వాడికో లెఖ్ఖా? అందుకే- చదువూ గిదువూ ఎందుకు- వున్నకొంద్ర దున్నుకుంటే చాలునే అంటే నువ్వువిన్నావూ? ఇప్పుడు ముప్పొద్దులా, ఎండనక పొలాన రక్తమోడ్చే తండ్రికి మధ్యాహ్నభోజనం వుంటేయేం, లేకపోతేయేం—వాడిక్కావలసింది,-తన షోకూ, తన భోజనం- తన పుస్తకాలూను ..ఇకస్కూళ్ళు తెరిచారుగా — మళ్ళా కొత్త పుస్తకాలూ, జీతం కావాలంటాడు! వాడిదేం పోయింది? ఇంటో గింజలు నిండుకుని యీపూట గంజికి లేకపోయినా;— తాతల్నాటి యీలోగిలీ; ఎంతకష్టమొచ్చినా తొణకనినిన్నూ; సుక్షేత్రమనుకుంటున్న మూడెకరాల కొంద్రా చూచి వాడేదో బావుకుతినొచ్చు ననుకుంటాడు... అంతేగాని, మన తాహతెంతా? అని ఆలోచించడు...' అని తండ్రి పళ్ళు కొరుకుతున్నాడు.

వీపుచిట్లుతుందనే భయంతో. బిక్కుబిక్కుమంటూచెరువుగట్టుమీది నిద్రగన్నేరు చెట్లచాటున కూర్చుని ఎంతోఆలోచించాడు. తన తప్పేమి

కనిపించలేదు. వాళ్ళు చదువుకోమంటేనే తను చదువుకుంటున్నాడు...స్కాలర్‌షిప్ సంపాదించి స్కూలుజీతం లేకుండా చేసుకున్నాడు. తోటి స్నేహితులు తన బీదతనాన్ని ... 'దేవిరిగొట్టు మొఖం' అని ఎగతాళిచేసినా సహించి రెండుజతల బట్టలనే భద్రంగా, శుభ్రంగా వాడుకుంటున్నాడు.

ఆరోజున వేసంగిసెలవులాఖరున స్కూలు తెరిచారు. ఆ సంగతి గుర్తులేకనో, లేక యింట్లో గింజలునిండుకునో తల్లి వంట చాలినంత చేయలేదు. ఆమె పసిపిల్లకు పాలిస్తూంటే తనే కాస్త అన్నం టిఫిన్ క్యారియర్‌లో మధ్యాహ్నంకోసం తీసుకుని స్కూలుకువెళ్ళాడు. దానికింత అంతరార్థంవున్నదనీ, తనునడిచినది జారుడు దోవవెంటేననీ అతనికర్థంకాలేదు. కాని; తండ్రిమాటలు అతనిదోవ జారుడునేలేనని రుజువుచేస్తున్నాయ్. కాదనలేదు. తలితండ్రులు ఎన్నికష్టాలుపడితే— పెద్దకొడుకయిన తనను అంత అసహ్యించుకుంటున్నారో అంచనావేసుకున్నాడు.

ఫోర్తుఫారంతో తను చదువుకునే అవకాశం, ఉబలాటం, జారి పోయిందనే అనుకున్నాడు. గత సంఘటన జరిగిన తర్వాత వారంరోజులు పొలం పనికూడా చేశాడు. "హాయిగా చదువుకునేదానికి, పదిహేనో ఏటేమన్నపిసుక్కోవడమేమిటోయ్!" అని తన గ్రామంలోని యితర రైతుల పిల్లలు వెక్కిరించితే — తానిప్పుడు నడిచేదీ జారుడు మార్గమే కాబోలు ననుకున్నాడు. తల్లి- తండ్రికి అరడజను పిల్లల్ని చూపుతూ- "ఇంతమందీ మూడెకరాల మేరంలో ఏం బొవుకు తింటారు చెప్పండీ...అయినకాడికి నా గాజుల జతన్నా అమ్మి ఆ పెద్దవాడికి మెట్రిక్లేషన్‌దాకా నన్నా పూర్తిచేయించితే, ఏ గుమాస్తాగిరో చేసుకుని వాడి బతుకువాడు బతుకుతాడు"- అని బతిమాలి, కంటనీళ్ళెట్టుకుంటే తండ్రి పట్టుదల జారిపోయింది.

ఎర్రట్ట స్కూల్‌ఫైనల్ సర్టిఫికెట్ పుస్తకం చంకను పెట్టుకుని బస్తీల్లోని ఆఫీసులన్నీ తిరిగాడు మున్ఫైఫరాళ్ళ గుమాస్తాగిరీకోసం - కుషన్లలో కూర్చున్న వారతన్ని చూచి, నవ్వి- 'మైనారిటీ అయినా వెళ్ళని నీకు వుద్యోగ మేమిటోయ్?? చదువులోనైనా మొదటి మెట్టు మాత్రం ఎక్కావ్...ఏ గ్రాడ్యుయేటోనన్నా అయితే వుద్యోగంకోసం దరఖాస్తు పెట్టుకోవడానికి అర్హుడనేవాళ్ళం... వెళ్ళు... వెళ్ళవయ్యా। అంటే!' అనే వెలిబుచ్చారు. నిజానికి తనింకా వుద్యోగార్హుడు కాలేదేమో, తను తిరిగేది జారుడు తోవంటేనేమోనని అనుమానించాడు. కాని యింటివద్ద పరిస్థితులింకా దిగజారిపోయాయ్. వున్నవాళ్ళకే గంజికి చాలడంలేదు- తమ్ముళ్లు కూలికి వెళుతున్నారు.

తన వుద్యోగదీక్ష దిగజార్చుకుని ఆ గ్రామంలోని మూడెకరాలకోసం పరుగెత్తడం యింకా బురదలోకి జారడమేనని గ్రహించాడు. డైరెక్టర్ల కాళ్ళుపట్టుకుని ఒక కోపరేటివ్ బ్యాంకులో .0 రూపాయిల గుమాస్తాగిరీ సంపాదించిన ఆరు నెల్లకు, యింటికి అయిదు రూపాయిలు పంపగలిగాడు. తండ్రి వుత్తరంలో 'అంతకష్టపడి, నీకు యింత చదువుచెప్పిస్తే— వుద్యోగంలోచేరిన ఆరునెల్లకు అయిదురూపాయిలు పంపడానికి నీకు చేతులెలా వచ్చాయ్? ఇంటివద్దగ్గర పరిస్థితులు తెలిసిన బుద్ధిమంతుడవు నెలకు పాతిక ఖర్చుపెడుతున్నావంటే ఏమనుకోవాలి! బస్తీ అలవాట్లలోపడక—నెలకొక పదన్నా పంపించు. నీ పెద్దచెల్లెలు పెద్దమనిషయింది' అని గద్దించాడు.

అవును. తన పెద్దచెల్లెలుకు పెళ్ళి చెయ్యాలి. గుళ్లో పెళ్ళిచేస్తే అయిదురూపాయల్తో సరిపోను. కాని, తోటికులస్థులుగాని చుట్టాలుగాని వూరుకోరు. నోరు ఖాళీచేసుకుంటారు. కళ్ళు చికిలిస్తారు. కనక పెళ్ళికి రూ 100 అయినా కావాలి. ఇంతకూ తను పాతికా ఖర్చుపెట్టడం తప్పడుపోవేనా అని విమర్శించుకున్నాడు. గది అద్దె నాలుగు; హోటల్‌కు పదహారు; మంగలికి అర్థ, చాకలికి రూపాయి, కిరసనాయిల్ పావలా, వుత్తరాలకు పావలా; ఇక మిగిలేది మూడు. ఆ లెక్కను ఆరునెల్లకూ పద్దెనిమిది మిగలాలి. అయిదు మొన్న పంపించినవిపోను 13 ఏమయినట్లు? మొదటినెల చెంబూ, తుండుగుడ్డలు రెండూ కొన్నాడు. రూపాయిన్నర తక్కువయితే రెండో నెల జీతంలో యిస్తానని ఆగుమాస్తాదగ్గర అప్పు చేశాడు. రెండోనెల తోటిగుమాస్తాలతో 'రైతుబిడ్డ' సినిమాకు వెళ్ళాడు.

మూడోనెలలో జ్వరంవస్తే రూపాయి కాఫీకయింది. మిగిలిన రెండురూపాయిలూ, నాలుగో నెలలోని మూడూ పెట్టి జతబట్టలు కుట్టించు

కున్నాడు. ఈనెలలో ఒక పేదవిద్యార్థికిరూపాయి చందాయిచ్చాడు. ఇందులో తను చేసిన అనవసర ఖర్చేమిటి? అందరివలె తనూ సినిమాలకూ, కాఫీలకూ ఖర్చుచెయ్యడం లేదే?! ఏమో—తనది జారుడుదోవగానే వున్నదేమో అనుకున్నాడు.

సర్వీస్ కమీషన్ ప్యాసయి తాలూకా గుమాస్తా అయినపుడొక రైతుదగ్గర లంచం తీసుకోకుండా, ఆరైతుయొక్క అర్జీవిన్నపము మంజూరుచేయించినందుకు— 'ఇహ అడుక్కుతిన్నట్టే— వచ్చినవాడికల్లా అలాపనిచేసిపెడితే యీ తేభ్యానికేమొస్తుంది? మన బ్రతుకులుకూడా పాడుచేస్తున్నాడు పిచ్చికుంక...ఇలాగయితే పెళ్ళీ పెడాకులూ ఎలాచేసుకుంటాడు? ఇప్పుడు నాలుగు రాళ్లు సంపాదించుకోలేకపోతే, పిల్లాజెల్లా కలిగాక ముష్టికి పంపుతాడా?'—అని తోటిగుమాస్తాలు తిట్టిపోశారు.

తను రైతుల కష్టనష్టాలెరిగిన మనిషి. వాళ్ళ న్యాయమైన కోర్కెలు తీర్చడానికి తను లంచం తీసుకోవడం మానవత్వాన్నుండి దిగజారడమేననే వుద్దేశంతో వున్నాడు. కాని, యీ తోటిగుమాస్తాల వ్యాఖ్యలు తన దోవ జారుడునేలగుండా పోతూందంటున్నది స్పష్టంగా రుజువవుతోంది. కనక, తను ఆజారుడుదోవను వదిలి లౌకికవ్యక్తిగా లంచాలు తీసుకుంటున్నాడు. మొదట్లో తను లంచాలు తీసుకున్న రైతులు యిళ్ళకెళ్ళి పిల్లలతో సహా కడుపులుకొట్టుకుని ఏడుస్తున్నట్లు కలలుగని వులిక్కిపడి వీపుచరచుకునేవాడు. కాని, దినదినమూ నిండుతున్న సిగరెట్ల డబ్బాలోని 'నోట్లు' చూచి, తన తలిదండ్రుల, చెల్లెళ్ల, తమ్ముల తృప్తిముఖాలూహించుకు పొందే ఆనందంలో - ఆ పీడకలలు చెరిగిపోయాయ్.

ఇప్పుడు తనభార్యా, ముగ్గురు పిల్లలూ చక్కని యింట్లో కాపురముండి హాయిగానేబతుకుతున్నారు. అయినా, పుట్టింటి పెట్టుపోతలులేవని తలిదండ్రులు పోయిన చెల్లెళ్లూ; నగలు లేవని భార్యా; పట్టు పరికిణీలకు కూతుళ్లూ; నడిచే కుర్చీకోసం కొడుకూ గల్లంతుచేస్తున్నారు. ఇంతకాలంగా గవర్నమెంటు నౌకరీచేస్తూ - యింత అసమర్థులుగా సంపాదన చేస్తున్నవాళ్లు దద్దమ్మలేనని చాలామంది రిమార్కులు చేస్తున్నారు. బహిరంగసభల్లో, పత్రికల్లో-'లంచగొండులు ప్రజాద్రోహులు', 'లంచగొండులకు వురిశిక్షవేయాలి', 'గొలంచ ండులు రాక్షసులు', 'వారు తినేది పేద ప్రజల రక్తపుకూడు' - అనేమాటలుచూస్తే; తన దోవ జారుడుదోవగానే కనిపించుతూంది. పైగా క్రొత్త ప్రభుత్వం లంచగొండులను క్షమించనంది.

అందువల్ల ఆ జారుడు దోవను పోక - వచ్చే జీతం రాళ్ళతో జీవితాన్ని మంచి రహదారిగా నడుపుకుందామనుకున్నాడు. కలెక్టరు గుడ్డలకోటా ఒక బ్లాక్‌మార్కెట్‌సెట్టి కివ్వాలన్నాడు. తను అదిమంచిది కాదన్నాడు. కలెక్టర్ లంచం తీసుకుని ఆ సెట్టికే లైసెన్సు యిచ్చాడు. ప్రజలు గోల చేశారు. ప్రభుత్వం విచారణచేసింది. కలెక్టర్ నిర్దోషియనీ; అతడే లంచం తీసుకున్నాడనీ రుజువయింది. వుద్యోగం వూడిపోయింది. తనుకూడా ఆ సెట్టిగ్గర పదిరూపాయిలు తీసుకుని వున్నట్లయితే- కలెక్టర్‌లాగానే తనూ రక్షింపబడేవాడేమోనని, తనుపోయింది లేవడి దోవనీ లెంపలువేసుకున్నాడు. ఏమీతోచక కాలుగాలినపిల్లిలా తిరిగాడు. ఇది వరకు ఎప్పుడన్నా పార్కులో కూర్చున్నప్పటికీ తాలూకా దస్తరాల గొడవా, ఆఫీసర్ నడవడికా, రైతులమహజర్లూ గుర్తుతెచ్చుకునేవాడు. ఇప్పుడు విశ్రాంతి అనేది తన స్వంత సొమ్మయినట్లు పార్కు గడ్డిలో పడుకుని, అణా వేరుసెనక్కాయలు కొనితింటున్నాడు. అంత విశ్రాంతిలోనే జీవిత పర్యాలోకనంసాధ్యమయింది. తను 1903 లో పుట్టాడు. '22 లో వుద్యోగంలో చేరాడు. చెల్లెళ్ళ, తమ్ముళ్ళ పెళ్ళిళ్ళు చేశాడు. తలిదండ్రుల దహన, దిన, వార సంస్కారాలు తనచేతిమీదే జరిగాయ్. తను పెళ్ళాడి, ముగ్గురు బిడ్డల్నికూడా సాకుతున్నాడు. స్వంత యిల్లొకటుంది.

ఎంత సంపాదిస్తేనేం యీ నాడు ఆ కలెక్టర్ గారిలాగా విచారణ జరిపే వుద్యోగికి ఒక చిన్న కారైనా కొని యీయలేనంత అశక్తుడు. ఆశక్తే వుంటే తన వుద్యోగం వూడిపోయేది కాదుగా! 43 ఏళ్ళవాడే అయినా యిపుడు 70 ఏళ్ళ వాడిలా సత్తువ జావగారిపోయింది. సత్తువఅంతా ఆ తాలూకా గుమాస్తాపనికే ఖర్చయిపోయింది. ఇప్పుడిహ యేం చెయ్యాలా అనేది పెద్ద ప్రశ్నార్థకం.

ఉన్నడబ్బుతో పదిరిక్షాలుకొని అద్దెకిచ్చి జీవితం గడుపుతున్నాడు. తన సంపాదనంతా

మింగిన చెల్లెళ్ళూ తమ్ముళ్లూ యిప్పుడు ఉత్తరాలన్నా వేయడంలేదు. బజారుకు వెళితే అంతా తనను చీడ పురుగులా చూస్తున్నారు. ఆఖరుకు దొంగ వ్యాపారులుకూడా తన మొఖాన నవ్వుతున్నారు. తన యెదుట ఏనాడూ తలగుడ్డ తీయని సెట్టి—యీ సాయంకాలం జరీకండువా వల్లెవాటు వేసి, తాజ మహల్ బీడీపొగ తన ముఖాన వూత్తూ తనను రాసుకునే వెళ్ళిపోయాడు. పైగా ప్రక్కనున్న మరో మనిషితో — "భోంచేస్తే మంచిది గాని, చిరుతిండి తింటే లాభమేమిటి? లంచాల చిరుతిండ్లుతిని అజీర్తిచేస్తే చివరికి మొదటికే మోసం వచ్చే! గడ్డి తిన్నగాడిద చస్తుంది; గడ్డి నేల చస్తుందటయ్యా!' అని పకపకా నవ్వాడు.

తన గుండెల్లో గాలంవేసి కెలికినట్లయి, చర చరా యింటికి వెళ్ళాడు. భార్యను భోజనంవడ్డించమంటే - 'యింకా వంటకాలేదు...వూరికే బలాదూరు తిరక్కపోతే - పిల్లలకు పాఠాలు చెప్పరాదూ?—ప్రయివేటు జీతాలు ఖర్చన్నా తగ్గుతుందీ' అని విసుక్కుంది. అదీ నిజమేననీ; తను వుద్యోగం పోయినాక మరీ జారుడు దోవంట జారిపోతున్నాననీ అనుకున్నాడు. పెద్ద పిల్ల పుస్తకం చేతి కిచ్చింది, ఒక లెఖ్ఖచెయ్యమని పురమాయించి; ఆ పుస్తకం మూశాడు.

అట్టమీద 'ఆత్మహత్య' అని 72 పాయింట్ టైపులో వుంది. చేతిలోకి తీసుకు చూచాడు. ఏనాడూ పేపరు మూడనట్లు ఆ పుస్తకంమీద అడ్డగావున్న పాత దినపత్రిక వూడదీసి ఆ వార్త చదివాడు. 'స్కూలు ఫయినల్ పరీక్ష తప్పినందుకు గుంటూరులో ఒక విద్యార్థి నూతిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పాపం! అతడు పేద వాడట' అని ఆ వార్త.

అతనూ 'పాపం!' అనుకున్నాడు. మళ్ళా అవును. ఎందుకీ జారుడు దోవల జీవితం!? నేనూ ఆ రోజుల్లో ఆత్మహత్య చేసుకుంటే యీ పీడ, యీ జంఝాటంవుండేది కాదు గదా! చచ్చిపోయిన తర్వాత నేనెవరో, మిగిలిన బంధు మిత్రులెవరో! హాయిగా ఆ గుక్కెడు ప్రాణాలూవదిలితే నిశ్చింత. మిగిలినవాళ్ళు ఏ బాధలుపడితే మనకేం, ఏ సుఖాలు బావుకుంటే మనకేం' అని పెద్ద డిస్కవరీచేసినట్లు నిట్టూర్చాడు. తను ఫోర్తుఫారం ప్యాసయ్యాక, తండ్రి పొలంపంపిన వారంరోజుల్లోనూ ఏదో ఒకనాడు ఏకాలవలో నన్నాపడిచావక, యింతకాలం బ్రతకడం—యీ జారుడుదోవ అనుభవంకోసమేనా అని తనను తా నిందించుకున్నాడు.

ఆ పాతపత్రికను యింకా తిరగేశాడు. మరోక చోట ఒక ప్రఖ్యాతరచయిత కథానిక వుంది. అతనిక్కావలసింది కథ పేరూ కాదు, రచయిత ప్రఖ్యాతీకాదు— ఉబుసుపోక కాలక్షేపంకోసం చదివాడు. ఆ కథలో కథానాయకి వితంతువు. కుటుంబ సంఘబాధలూ, యౌవనబాధా సహించలేక ఆత్మహత్య చేసుకోబోతుంది. నూతిలో దూకబోతూ చుట్టూచూస్తుంది. తన ప్రియమైన పూలచెట్లూ, యిల్లూ, తలిదండ్రులూ — ముఖ్యంగా క్రొత్తగా ఏర్పడిన ప్రియుడూ గుర్తుకొస్తారు. ఆమె 'చచ్చి సాధించేదేమిటి? బ్రతికి జీవితాన్ని అనుభవించడమే మానవజన్మకు సార్థకం. అడ్డొచ్చిన పరిస్థితులకనుగుణంగా వుండలేకపోతే—ఎదురు తిరిగి, పరిస్థితుల నదుపులో పెట్టుకుని వాటిచేత పని చేయించుకోవాలి! అదీ ధీరమానవలక్షణం...' అనుకుని ఆత్మహత్య మానుకుని ప్రియునింటికి ప్రయాణమౌతుంది.

తర్వాత కథలో ఆమె ప్రియునిజేరి సుఖాలందడం సహజం. కాని అతనిక్కావలసింది కథ కాదు. నే కోట్ చేసిన మాటలు—అంటే ఆమె భావపరివర్తన కారకమైన మాటలు అతనిని వుత్తేజపరిచాయ్. మాసినగడ్డం నిమురుకుని చిరునవ్వు వెలిగించాడు—'నిజమే...చచ్చి సాధించేదేమిటి? బ్రదికి అనుభవించడమే మానవజీవిత పరమార్థం' అనుకుని నడుం నిటారుగా పెట్టుకూర్చున్నాడు.

"అదేమిటిలా జావగారిపోతున్నారు?...భోంచెయ్యరాఏమిటి?...రండర్రా మనంభోంచేద్దాం" అని అరిచి పిల్లలతో వంటింట్లోకెళ్ళిపోయింది భార్య. "నిజమే...లోగడలాగా అన్నీ పనులూ చర చరా చేసుకోకుండా యిలా వూహాల్తో జారుడుదోవెంట పోతున్నానేమిటి?" అనుకుని పై పంచె దులిపి అతడు భోజనానికిలేచాడు,